తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

కాంగ్రెస్ సెక్యులర్ పార్టీనా.. కాదా?

- రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సమాధానం చెప్పాలి
- మైనార్టీలకు రేవంత్‌రెడ్డి పాలనలో తీవ్ర అన్యాయం
- కేసీఆర్ మైనార్టీలకు అనేక సబ్సిడీలు ఇచ్చారు
- మోదీ, అమిత్‌ షాను ఫాలో అవుతున్న రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సెక్యులర్ పార్టీనా? కాదా? అనేది రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ స్పష్టంచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో మైనార్టీలకు వివిధ పథకాల్లో సబ్సిడీలు ఇవ్వగా, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో ఆదివారం పలువురు మైనార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించి మర్చిపోయారని, మైనార్టీల ఓట్లు వేసుకొని మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీల కోసం కేసీఆర్ గతంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇచ్చారని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ అమలుచేయడం లేదని విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో ఇస్తామన్న ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని విమర్శించారు. మోదీని రేవంత్‌రెడ్డి బడే భాయ్ అంటారని, ఆరెస్సెస్‌లో పనిచేశారని, తెలంగాణలో గుజరాత్ మాడల్ అమలుచేస్తామని అంటున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, అమిత్‌షాను ఫాలో అవుతున్నారని మండిపడ్డారు.

ఉర్దూ డీఎస్సీ ఏమైంది?

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఉర్దూ డీఎస్సీ హామీ ఏమైందని మహమూద్ అలీ నిలదీశారు. కేసీఆర్ ఉర్దూను తెలంగాణ రెండో అధికార భాషగా ప్రకటించారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో పాతబస్తీ అభివృద్ధి జరిగిందని, రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మాణమయ్యాయని గుర్తుచేశారు. మలక్‌పేటలో ఐటీపార్క్‌ను కేటీఆర్ ఏర్పాటుచేశారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముస్లిం, మైనార్టీలపై దాడులు పెరిగాయని విమర్శించారు. రైతులు, ప్రజలు పరేషాన్‌లో ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. హైడ్రా, మూసీ కూల్చివేతలతో పాతబస్తీ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఫైరయ్యారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్ హుస్సేన్, పార్టీ నాయకులు బద్రుద్దీన్, కలీమ్, మునీర్, యూసఫ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన 60 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - జడ్చర్ల

బిల్డర్‌ది సర్కారు హత్యే

మొదటిపేజీ తరువాయి...

పిల్లలు, కుటుంబ సభ్యుల ఆవేదనకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

> రాష్ట్రంలో ఆత్మహత్యలకు పరోక్షంగా, ప్రత్యక్షంగా రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య పాలన, అసమర్థ విధానాలే కారణం. తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని చెప్పకొంటున్న రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో నిర్మాణ రంగాన్ని చేజేతులా నాశనం చేసిండు. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లాట్లు అమ్ముకోలేని దుస్థితిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులున్నరు. కేసీఆర్ పదేండ్లలో హైదరాబాద్‌ను రోల్ మోడల్‌గా మారిస్తే.. రేవంత్‌రెడ్డి దాని ఖ్యాతిని దిగజార్చిండు.
> -హరీశ్‌రావు

బిల్డర్లు ఆత్మహత్య చేసుకునే దుస్థితి దారుణం

పదేండ్ల కేసీఆర్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్గధామంగా వెలుగొందిన హైదరాబాద్‌లో 14 నెలల్లోనే ఫ్లాట్లు అమ్ముడుపోక బిల్డర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రావడం దారుణమని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్లాట్లు అమ్ముకోలేని స్థితిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులున్నారని అన్నారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను రోల్ మోడల్‌గా మారిస్తే.. రేవంత్‌రెడ్డి దాని ఖ్యాతిని దిగజార్చారని విమర్శించారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. మున్సిపల్ మంత్రి, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి దీనిపై దృష్టి సారించాలని సూచించారు.

హైడ్రా దుకాణం బంద్ చెయ్యాలె

హైడ్రా పేరుతో రోజుకో ప్రాంతంలో కూల్చివేతలు చేపడుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని హరీశ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఫ్లాట్లు కొనేందుకు వెనుకాడుతున్నారని చెప్పారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. హైడ్రా దుకాణాన్ని బంద్ చెయ్యకుంటే నిర్మాణ రంగం మరింత దిగజారే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. హైడ్రా పేరుతో పర్మిషన్లు ఉన్న బిల్డింగులను కూడా కూల్చేసి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఫ్లాట్లను కొనుగోలు చేయకుండా చేశారని విమర్శించారు. మూసీ పేరిట పేదల ఇండ్లను కూల్చడం, ఫార్మా సిటీని రద్దు చేయడం, రాత్రి పది గంటలకే దుకాణాలు బందు చేయాలనే అనాలోచిత నిర్ణయాల వల్ల హైదరాబాద్‌పై పాజిటివిటీ తగ్గిపోయిందన్నారు. హైడ్రా బూచితో రేవంత్‌రెడ్డి రాష్ట్ర నిర్మాణ రంగంపై వ్యతిరేక పరిస్థితులను సృష్టించారని, రియల్ ఎస్టేట్ వ్యాపారంపై పాజిటివిటీ లేకుండా చేశారని మండిపడ్డారు. విదేశాల్లో ఉండే వారు, ఉత్తరాది రాష్ట్రాల వారు హైదరాబాద్‌లో ఫ్లాట్లు కొనేందుకు జంకుతున్నారని చెప్పారు. ఇప్పటికే బిల్డర్లు బెంగళూరు, ముంబై, నోయిడా వంటి నగరాలకు తరలిపోతున్నారని గుర్తుచేశారు. భేషజాలకు పోకుండా ఆత్మవిమర్శ చేసుకుని, ఇప్పటికైనా మేల్కొకపోతే పదేండ్లుగా పురోభివృద్ధిలో ఉన్న తెలంగాణ తిరోగమనం బాట పట్టే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. హైడ్రాను పక్కకు పెట్టి రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

> వేణుగోపాల్‌రెడ్డి కుటుంబం ఆవేదన చూస్తుంటే హృదయం ద్రవించివేస్తున్నది. బ్యాంకుల్లో అప్పులు తెచ్చి నిర్మించిన అపార్ట్‌మెంట్ అమ్ముడుపోక వడ్డీలు పెరిగిపోయి దిక్కుతోచని స్థితిలో ఆత్మస్థైర్యం కోల్పోయిన వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం కలచివేసింది. 39 ఏండ్ల యువ బిల్డర్ పిల్లలు, కుటుంబ సభ్యుల రోదనకు ఎవరు బాధ్యత వహిస్తరు? కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు నిత్యం ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ప్రాణాలు తీసుకునే పరిస్థితి దాపురించింది.
> -హరీశ్‌రావు

వేణుగోపాల్‌రెడ్డి కుంటుంబాన్ని ఆదుకోండి

'వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. ఎల్ఐసీలో ఉన్న రూ.18 లక్షల డబ్బును తెచ్చి అప్పులు కట్టి చనిపోయాడు. అలాంటి నిజాయితీపరుడు ఈరోజు కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలకు బలైపోయాడు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. వేణుగోపాల్‌రెడ్డి మృతిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం సిగ్గుచేటు. తాను ఉపాధి పొందుతూ ఎంతో మందికి ఉపాధి కల్పించే బిల్డర్ చనిపోతే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణం' అని హరీశ్ మండిపడ్డారు.

ఆత్మహత్యలొద్దు..

'రాష్ట్ర ప్రజలారా.. ఆత్మహత్యలు చేసుకోవద్దు. చావే అన్నింటికీ పరిష్కారం కాదు. రైతన్నలు, నేతన్నలు, ఆటో కార్మికులు, బిల్డర్లు.. ఏ ఒక్కరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటది. మీ కోసం అలుపెరుగని పోరాటం చేస్తుంది. మీ సమస్యలు చెప్పుకోవడానికి తెలంగాణ భవన్‌కు రండి. తెలంగాణ భవన్‌కు జనతా గ్యారేజ్ అనే పేరుంది. మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని నిలబెట్టేందుకు అన్ని రకాలుగా సాయం చేస్తాం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్డర్ల సమస్యలపై మాట్లాడుతాం. ప్రభుత్వం కండ్లు తెరిపిస్తాం' అని హరీశ్ భరోసా ఇచ్చారు.

బిల్డర్స్ అసోసియేషన్ మద్దతుగా నిలవాలి

బిల్డర్స్ అసోసియేషన్ ముందుకొచ్చి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని హరీశ్ సూచించారు. తోటి బిల్డర్ ఆత్మహత్య చేసుకొని చనిపోయి ఐదు రోజులు గడిచినా ఒక్క బిల్డర్ అసోసియేషన్ వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమని వాపోయారు. మరో బిల్డర్‌కు ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అసోసియేషన్లపై ఉందని గుర్తుచేశారు.

రేవంత్‌పై బాధిత కుటుంబాల ఆగ్రహం

సీఎం రేవంత్‌రెడ్డిపై బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణకు సీఎం ఉన్నారా? లేరా? అనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. రియల్ ఎస్టేట్ పడిపోయాక ఆదాయం ఎలా వస్తుందని నిలదీశారు. వేలాది మందికి ఉపాధి కల్పించే రియల్ ఎస్టేట్ రంగం పూర్తి నష్టాల్లో ఉన్నదని ఆవేదనచెందారు.

పథకాలన్నీ అమలు చేసి స్థానిక ఎన్నికలు పెట్టండి: హరీశ్

అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పి రేవంత్‌రెడ్డి మాట తప్పారని, ఇప్పుడు ఏమీ ఇవ్వకుండానే ఎన్నికల కోడ్‌తో తప్పించుకుందామని చూస్తున్నాడని, రైతులు, ప్రజలు ఆలోచించాలని, కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దని హరీశ్ సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతిరైతుకు కేసీఆర్ రైతుబంధు వేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి మోసం చేసే కార్యక్రమాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే అన్ని పథకాలను అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి హరీశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టమైందని, అందుకే గ్రామాల్లో గ్రామ దేవతల ప్రతిష్ఠాపనలు పెరిగాయని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో కల్లు దుకాణాలపై ఆబ్కారీ శాఖ దాడులు జరగలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్నదని, గౌడన్నలను అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్నదని విమర్శిచారు.

4 పథకాలన్నడు.. పైసలు పడ్డాయా?

'జనవరి 26న నాలుగు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిండు. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందరికీ వచ్చిందా?' అని హరీశ్ ప్రశ్నించారు. మండలానికి ఒక్క గ్రామంలోనే రైతు భరోసా డబ్బులు వేస్తే మరి మిగతా గ్రామాల రైతుల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఆఖరికి రియల్ ఎస్టేట్ బిల్డర్లు సైతం ఆత్మహత్య చేసుకుంటున్నారని వాపోయారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఆపలేదని, కేసీఆర్ అధికారంలోకి రాగానే రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేశారని, రైతు బంధు ఎకరాకు రూ.10 వేలు, కల్యాణ లక్ష్మి రూ.లక్ష, 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చారని గుర్తు చేశారు. పండిన పంటను గింజ మిగలకుండా కొన్నాడని, ముదిరాజ్‌లకు ఉచితంగా చేప పిల్లలు, గొల్ల కుర్మలకు గొర్రెలను పంపిణీ చేశారని, గీత కార్మికులకు వైన్స్ షాపుల్లో 16 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు.

ఆత్మహత్యల తెలంగాణగా మారుస్తారా?

- సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): పదేండ్ల పాలనలో కేసీఆర్ అన్నపూర్ణగా తీర్చిదిద్దిన తెలంగాణను ఆత్మహత్యల తెలంగాణగా మారుస్తారా? అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతన్నలు, ఆటోడ్రైవర్లు, చేనేతన్నలు ఎంతోమంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట తెలంగాణ రియల్ ఎస్టేట్‌ను కాంగ్రెస్ కుదేలు చేసిందని విమర్శించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడులురాక, మిత్తి కూడా చెల్లించలేని స్థితిలో ఉసురు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపారని పేర్కొన్నారు. రేవంత్ పాలనలో సాగునీళ్ల లేక, కరంటు రాక, పంటలు కొనుగోలు చేయక, రైతుభరోసాలేక, రుణమాఫీకాక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలన కాదని, ప్రజలను వేధించే పాలన అని దుయ్యబట్టారు.

ఆర్జీ కర్ మెడికల్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

కోల్‌కతా, ఫిబ్రవరి 2: కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కమర్హతిలోని ఈఎస్ఐ క్వార్టర్స్‌లో 20 ఏండ్ల రెండో ఏడాది వైద్య విద్యార్థిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె కొంత కాలంగా డిప్రెషన్, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నటు పోలీసులు చెప్పారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, సూసైడ్ నోట్ కూడా లభించలేదని తెలిపారు. కాగా, ఒక ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారంతో ఇటీవల ఆర్జీ కర్ దవాఖాన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే.

రేవంత్‌లో కలవరం మొదలైంది

- బీఆర్‌ఎస్ నేత ఆర్వీ మహేందర్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో తలపెట్టనున్న పెను గర్జనతో సీఎం రేవంత్‌రెడ్డిలో అప్పుడే కలవరం మొదలైందని బీఆర్‌ఎస్ నేత, గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్వీ మహేందర్‌కుమార్ విమర్శించారు. ఓ వైపు సొంత సర్వే వెక్కిరింత ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరో వైపు ఎమ్మెల్యేల వేరుకుంపటి సెగ ఊపిరాడకుండా చేస్తున్నదని ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు, కమీషన్ల పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్ వంకర టింకర నిర్ణయాలతో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు.

కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్‌కు కలవరం

- ఆనవాళ్లు తుడిచేయాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర
- 57 మంది గురుకుల విద్యార్థుల మృతి బాధాకరం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురిలోని మైనారిటీ గురుకుల కళాశాల వద్ద మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఫిబ్రవరి 2: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కలవరపాటుకు గురవుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల కళాశాలలో రెండు రోజుల క్రితం ఆహారం వికటించి ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా.. వారిని పరామర్శించేందుకు ఆదివారం ఆయన గురుకులానికి చేరుకోగా గేటు వద్దే ఆపేశారు. వెంటనే ఆయన ప్రిన్సిపాల్ లక్ష్మికి ఫోన్ చేయగా.. గురుకులంలోకి ఎవరినీ అనుమతించకూడదని కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయని చెప్పడంతో ఆయన కళాశాల గేటు బయటే మీడియాతో మాట్లాడారు. తాము మైనారిటీ గురుకులానికి వచ్చింది ఆందోళనలు చేయడానికి కాదని, విద్యార్థులను పరామర్శించి వారిలో మనోధైర్యాన్ని నింపి, ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. కలెక్టర్ అనుమతి లేకుండా ఎవరూ రావద్దని ఆంక్షలు పెట్టడం ఎంతమాత్రం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇటీవలి కాలంలో గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్ కావడం, విషపురుగులు కుట్టడం, ఆహారంలో బల్లులు పడటం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 57 మంది విద్యార్థులు చనిపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ చరిత్ర లేకుండా చేయడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. మైనారిటీల ప్రగతి ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గురుకుల పాఠశాలలు, కేసీఆర్ కిట్లు, కల్యాణ లక్ష్మి, గొర్రెల పంపిణీ ఇలా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు తెలిపారు. ఇవన్నీ కేసీఆర్ ఆనవాళ్లు అని, వీటిని లేకుండా చేయడానికి కాంగ్రెస్ సర్కార్ కుట్ర జరుగుతున్నదని దుయ్యబట్టారు.

ఈసీపై కాంగ్రెస్ 'ఈగిల్' పర్యవేక్షణ

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్ దేశంలో ఎన్నికలను న్యాయంగా, స్వేచ్ఛగా నిర్వహిస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించేందుకు 'ఈగిల్' పేరిట కాంగ్రెస్ ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈగిల్)ను ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈ బృందం దృష్టి సారిస్తుంది. ఓ నివేదికను రూపొందించి, పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తుంది.

వర్గీకరణ చేయకుంటే సర్కార్‌ను కూల్చేస్తం

- సుప్రీంకోర్టు తీర్పు వచ్చి 5 నెలలు దాటినా చర్యలేవి?
- మాదిగలంటే కాంగ్రెస్‌కు చులకన
- మందకృష్ణ మాదిగ ఆగ్రహం



బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 2: మాదిగల పట్ల కాంగ్రెస్ పార్టీకి చులకనభావం ఉన్నదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వెంటనే వర్గీకరణ చేయకపోతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చడానికైనా సిద్ధమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. బన్సీలాల్‌పేట్‌లోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న జరగబోయే 'వేల గొంతులు-లక్ష డప్పుల' సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందరికంటే ముందు తెలంగాణలో వర్గీకరణ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. మాలల ఒత్తిడికి తలొగ్గి వర్గీకరణ చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఐదు నెలలు పూర్తయిందని, వేచిచూడలేక న్యాయం కోసం రోడ్డెక్కాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కే హేమలత, ఎల్ ప్రసన్న లక్ష్మీ, రచయిత మిట్టపల్లి సురేందర్, జర్నలిస్టులు ఇస్మాయిల్, చంద్రశేఖర్, నాయకులు పృథ్వీరాజ్ యాదవ్, గోవిందు నరేశ్, బిక్షపతి, నర్సింహారావు, మల్లికార్జున్, అంజన్న, అశోక్, కేఎం కృష్ణ, బీ మహేశ్, ఎస్‌వై గిరి, మహేశ్, కే సతీశ్, ఎస్ రాజు, సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు'కు మద్దతు

- 6న ఇందిరాపార్క్ వద్ద జరగాల్సిన దీక్ష విరమణ
- మా దారులు వేరైనా లక్ష్యం మాత్రం ఒక్కటే
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి

రవీంద్రభారతి, ఫిబ్రవరి2: ఈ నెల 7న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపడుతున్న లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ వెల్లడించారు. ఫిబ్రవరి 6న నిర్వహించాలనుకున్న ఇందిరాపార్క్ దీక్షా కార్యక్రమాన్ని విరమించుకుంటున్నామని తెలిపారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సూచన మేరకు తాను దీక్షను విరమించుకొని, లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దారులు వేరైనా తమ లక్ష్యం ఒక్కటేనని, విభేదాలను సైతం పక్కనపెట్టి వర్గీకరణ కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ప్రభుత్వానికి భట్టి విక్రమార్క, వివేక్ వెంకటస్వామి అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో మధుమాదిగ, రమేశ్‌మాదిగ, యాదయ్య, పీ రమేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో రోజంతా హైటెన్షన్

- కాంగ్రెస్-బీఆర్‌ఎస్ నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లు
- బహిరంగ చర్చకు పిలుపు నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతల అరెస్టు
- తెల్లవారుజామునే ఇండ్లల్లోకి చొరబడి అదుపులోకి
- పోలీసుల తీరుపై బీఆర్‌ఎస్ ఫైర్
- ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అరెస్టు
- మధ్యాహ్నం తరువాత విడుదల

సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

సత్తుపల్లి టౌన్/వేంసూరు, ఫిబ్రవరి 2: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, బహిరంగ చర్చకు పిలుపు నేపథ్యంలో ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రోజంతా హైటెన్షన్ నెలకొన్నది. ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు వస్తారనే సమాచారం మేరకు పోలీసులు ఆయా పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సత్తుపల్లిలో రాజకీయ వేడి రాజుకున్నది. తెల్లవారుజామున 4 గంటలకే బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం విమర్శలకు దారితీసింది. ఆయా నాయకుల ఇండ్లకు వెళ్లిన పోలీసులు.. వారిని నిద్రలేపి, కనీసం బ్రష్ కూడా చేసుకోనివ్వకుండా తీసుకెళ్లడంతో పార్టీ కార్యకర్తలు భగ్గుమంటున్నారు. సత్తుపల్లి మున్సిపల్ పాలకవర్గం ఐదేండ్ల పదవీకాలం పూర్తిచేసుకున్నందున బీఆర్‌ఎస్‌కు చెందిన పాలకవర్గ సభ్యులు గత నెల 31న అభినందన సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సత్తుపల్లిలో అవినీతి రాజ్యమేలుతున్నదని అన్నారు. 'డీ' ట్యాక్స్ (స్థానిక ఎమ్మెల్యే రాగమయి భర్త దయానంద్) పేరిట అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ నాయకులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈనెల ఒకటిన కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి సండ్ర వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రత్యారోపణలు చేశారు. వసూళ్లు, అవినీతి ఆరోపణలపై సత్తుపల్లి అంబేద్కర్ రింగ్‌సెంటర్ వద్దకు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో ఆదివారం రెండు పార్టీల నాయకులు సత్తుపల్లి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంటారని నిఘా వర్గాల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ముందస్తుగా బీఆర్‌ఎస్ నాయకులను ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తీసుకెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ నేతలు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, అద్దంకి అనిల్, గుండ్రు రాఘవేంద్ర, రఫీ, మల్లూరి అంకంరాజు, వీరపునేని బాబి, దొడ్డా శంకర్‌రావు, నడ్డి ఆనందరావు సహా మొత్తం 19 మంది ఉన్నారు. విషయం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు తెలియడంతో పెద్ద ఎత్తున సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు.. అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలను పొరుగునే ఉన్న వేంసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే రాగమయి వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు వారి ఇండ్లకు వెళ్లారు. తాము అధికార పార్టీ నేతలమని, తమను ఎందుకు అరెస్టు చేస్తారంటూ పలువురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ పోలీసులు వారిని అరెస్టు చేసి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రింగ్‌సెంటర్ వద్ద కూడా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 29 మందిని అరెస్టు చేశారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి భర్త దయానంద్.. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అధికార పార్టీ నేతలను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ నిలదీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ బయట దయానంద్ మీడియాతో మాట్లాడారు. సండ్ర వెంకటవీరయ్య ఎమ్మెల్యేగా ఉన్న 15 ఏండ్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆ విషయంలో తమ పార్టీ నాయకులు బహిరంగ చర్చకు పిలిచారని, అందుకు తమ వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

నిద్రలో ఉన్నవారిని లేపి అరెస్ట్ చేస్తారా?

ఇక వేంసూరు పీఎస్‌లోని బీఆర్‌ఎస్ నేతలను మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శించారు. నిద్రిస్తున్న తమ నాయకులను వేకువజామునే లేపి ఎందుకు అరెస్టు చేశారని పోలీసులను ప్రశ్నించారు. సండ్ర పీఎస్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో గడిచిన ఏడాది పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను రుజువు చేసే విషయంలో తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చర్చకు ఎక్కడైనా సిద్ధమేనని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పోలీసులను ఇబ్బంది పెట్టే విధంగా తాము నిరసనలు చేపట్టబోమని కల్లూరు ఏసీపీ రఘుకు ఫోన్‌లో హామీ ఇవ్వడంతో వేంసూరు పీఎస్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ రఘు మాట్లాడుతూ.. రెండు పార్టీల నాయకులు ఆదివారం బహిరంగ చర్చకు వస్తారనే సమాచారంతోనే ముందస్తుగా అరెస్టు చేసినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇలాంటి చర్చలు, సభలకు అనుమతి లేదని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే రెండు పార్టీల నాయకులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad - 500 037 (TS) INDIA

WALK-IN INTERVIEW

Notification No. CITD/Trg./January/25 — Date: 30-01-2025

CITD intends to engage suitable candidates in the following posts which are purely on consolidate payment and on contractual basis initially for a period of 11months, which will be renewed from time to time on performance review of the candidate and need of the Institute.

S.NO.	POSITION	DATE OF INTERVIEW
1	Faculty for Computer Science and Engineering	07th Feb, 2025
2	Faculty for Electronics Engineering	07th Feb, 2025
3	Faculty for Mechanical Engineering	07th Feb, 2025
4	Faculty for Electrical Engineering	07th Feb, 2025

For detailed notification: Visit the link "Walk-in Interview-Feb, 2025" on our website www.citdindia.org'.
Sd/-
PRINCIPAL DIRECTOR